క్లుప్తంగా

ఎన్నికల హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

వైరా: కాంగ్రెస్ ప్రభుత్వ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం వైరాలో నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరుగ్యారంటీలు అమలు చేయకపోతే కమ్యూనిస్టు పార్టీ తరఫున పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. మాదినేని రమేష్, మెరుగు సత్యనారాయణ, సుంకర సుధాకర్, మల్లెంపాటి రామారావు, బోడపట్ల రవీందర్, బొంతు సమత తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

కొణిజర్ల/కల్లూరురూరల్/ఎర్రుపాలెం: కొత్తగా ఓటరు నమోదుకోసం దరఖాస్తు చేసుకునే విధంగా యువతీ యువకులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 9, 10 తేదీల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్లు తఫ్జల్ హుస్సేన్, ఉషాశారద, సాంబశివుడు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 ఏండ్లు నిండిన యువతీ యువకులు పోలింగ్ కేంద్రం వద్ద ఉండే బీఎల్ఓల వద్ద దరఖాస్తు ఫారాలు తీసుకుని ఓటరు నమోదుకు, తప్పుల సవరణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అన్నదానం..

మధిరరూరల్: అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయ అన్నదాన కమిటీ నిర్వాహకుడు కోనా జగదీష్ తెలిపారు. మధిర పట్టణంలోని మెయిన్ రోడ్ లో ఉన్న శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం గుర్రాల రంగారెడ్డి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ టౌన్ ఏఈ శరత్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బత్తుల చలమయ్య రోడ్, రాజబాపయ్య వీధి, తుమ్మూరు రామారావురోడ్, శ్రీనివాస టాకీస్‌రోడ్, హనుమాన్‌నగర్, మసీదురోడ్, లలితకుమారి ఆస్పత్రిరోడ్, తాళ్లమడ ఎక్స్‌ప్రెస్ ఫీడర్, వ్యవసాయ ఫీడర్‌లలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

తల్లాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

తల్లాడ: తల్లాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తల్లాడ విద్యుత్ ఏఈ రాయల ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందన్నారు.

వైరా సబ్ స్టేషన్‌లో..

వైరారూరల్: వైరా సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజనీర్ పి.సుందర్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముదిగొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

ముదిగొండ: విద్యుత్‌లైన్లు మరమ్మతు దృష్ట్యా ముదిగొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పారిశ్రామిక ఫీడర్3, న్యూలక్ష్మీపురం పారిశ్రామిక పరిధిలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, గోకినేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకువిద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

అమరవీరులకు నివాళి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని గుడిపాడులో అమరవీరుల వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు అమర్లపూడి శరత్ మాట్లాడుతూ.. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన పోరాటంలో అమరులైన వారి ఆశయ సాధన కోసం సోషలిస్ట్ సమాజ నిర్మాణానికై ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీను, దుర్గా, చల్లమ్మ, రజని, రంగమ్మ, సీత, పాల్గొన్నారు.

పుల్లయ్య సేవలు చిరస్మరణీయం

ఎర్రుపాలెం: సీపీఎం సీనియర్ నేత రామిశెట్టి పుల్లయ్య సేవలు చిరస్మరణీయమని పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ కొనియాడారు. శుక్రవారం మండలంలోని మీనవోలులో నిర్వహించిన పుల్లయ్య వర్ధంతి సభలో ఆయ న పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి నాగుల్ మీరా, మండల కమిటీ సభ్యులు సురేష్, ఉద్దండ్, పెద్దపుల్ల య్య, మొహిద్దీన్ పాల్గొన్నారు.

దుకాణాలు దూరం


రేషన్ దుకాణానికి నోచుకోని కోస్తాల గ్రామ పంచాయతీ వ్యూ

- కొత్త పంచాయతీల్లో చౌకదుకాణాల కొరత
- రేషన్ కోసం కిలో మీటర్ల ప్రయాణం
- ప్రతీ నెల ఇదే తంతు..
- ఇబ్బందులు పడుతున్న పల్లె ప్రజలు

వైరారూరల్: గత ప్రభుత్వం పల్లెల స్వయంపాలన కోసం సుమారు ఆరేళ్ల కిందట 500 జనాభా దాటిన విలీన గ్రామాలు, గిరిజన తండాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేస్తూ.. ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆశావాహులు రిజర్వేషన్లకు అనుగుణంగా పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి పల్లె ప్రథమ పౌరులుగా పల్లె పాలన సాగించి కొత్త పంచాయతీల గ్రామాభివృద్ధి సౌలభ్యానికి తమ వంతు కృషి చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ నూతనంగా ఏర్పాడిన పంచాయతీల్లో ఇంత వరకు చౌకదుకాణాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆయా పంచాయతీల ప్రజలు ప్రతి నెల రేషన్ బియ్యం కోసం సుమారు 2, 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న సమీప గ్రామ పంచాయతీలలోని రేషన్ దుకాణాలకు వెళ్లి మరీ బియ్యం తెచ్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొనడం వలన ప్రతి నెల వృద్ధులు, వికలాంగులతో పాటు పలు వర్గాల ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొవాల్సిన పరిస్థితులు దాపురించాయి.

మండలంలో ఇలా..

వైరా మండలంలో గతంలో 19 గ్రామ పంచాయతీలు ఉండగా జనాభా ప్రతిపాదికను బట్టి మరో 3 కొత్త పంచాయతీలు ఏర్పాడ్డాయి. ఇందులో సిరిపురం పంచాయతీ విలీన గ్రామమైన స్టేజీపినపాక.. తాటిపూడి పంచాయతీ విలీన గ్రామమైన కోస్తాల, అదే విధంగా గన్నవరం విలీన గ్రామంగా ఉన్న గోవిందపురం గ్రామాలు సుమారు ఆరేళ్ల కిందట నూతన పంచాయతీలుగా ఆవిర్భావించాయి.

నిబంధనల ప్రకారం..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 400 పైచిలుకు రేషన్ కార్డులు ఉన్న గ్రామ పంచాయతీలో మాత్రమే చౌక దుకాణాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ వైరా మండలంలో నూతనంగా ఏర్పడిన పంచాయతీల్లో రేషన్ దుకాణాల ఏర్పాటుకు సరిపడా రేషన్ కార్డులు లేకపోవడం వలన చౌకదుకాణాల ఏర్పాటులో జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. నూతనంగా ఏర్పడిన మూడు పంచాయతీల్లో మొత్తం కలిపి ఇప్పటి వరకు 311 రేషన్ కార్డులు ఉన్నట్లు సమాచారం. అందులో ప్రాథమిక అంచనాల ప్రకారం గోవింపురం-161, స్టేజీపినపాక-90, కోస్తాల-60 రేషన్ కార్డులు ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే మండలంలోని మొత్తం 15,983 రేషన్ కార్డులు ఉండగా మండల వ్యాప్తంగా మరో 1,168 మంది కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం.

తప్పని ఆగచాట్లు..

పలు గ్రామాల్లో చౌకదుకాణ నిర్వాహకులు నెలలో మూడురోజుల పాటు బియ్యం ఇస్తారు. ఆ సమయంలో తీసుకోకపోతే.. మరళ సుమారు 3 కిలోమీటర్ల మేర వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. చౌకదుకాణాలు లేని స్టేజీపినపాక, కోస్తాల గ్రామస్తులు, వృద్ధులు, వికలాంగులు ప్రతి నెల బియ్యం తెచ్చుకునేందుకు తీవ్ర ఇక్కట్లు పడడమే కాకుండా ఆటోల ఛార్జీల భారంగా మారుతున్నాయని.. దీనికి తోడు రోడ్డు సౌకర్యంకూడా సరిగా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ దుకాణాల్లో బయోమెట్రిక్‌లో వృద్ధుల వేలిముద్రలు పడకపోతే ఒకటికి 4 సార్లు రేషన్ దుకాణాల చుట్టూ తిరిగాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా ప్రజలు అవసరాలను దృష్టిలో ఉంచుకోని కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పంచాయతీల్లో రేషన్ దుకాణాలను ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

మూడు రోజులే ఇస్తారు..



స్టేజీపినపాక గ్రామంలో చౌక దుకాణం లేకపోవడంతో కేజీ సిరిపురం గ్రామ డీలర్ గ్రామంలో ప్రత్యామ్నాయంగా మూడు రోజుల పాటు బియ్యం ఇస్తారు. ఆ సమయంలో గ్రామస్తులు బియ్యం తెచ్చుకోలేకపోతే మరల సుమారు 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న కేజీ సిరిపురం పంచాయతీకి వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

– ఐనాల రాంబాబు, స్టేజీ పినపాక

దుకాణాలు ఏర్పాటు చేయాలి..



కొత్త పంచాయతీలు ఏర్పడి ఆరేళ్లు గడుస్తున్నా.. ఆయా పంచాయతీల్లో ఇంత వరకు చౌక దుకాణాలు ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. ప్రభుత్వం, అధికారులు నిబంధనలు పక్కన పెట్టి ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకోని ప్రతి కొత్త పంచాయతీలో చౌకదుకాణాలను ఏర్పాటు చేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలి.

– మంచాల జయరావు, మాజీ సర్పంచ్, కోస్తాల

కుటుంబ నిర్ధారణ సర్వే చారిత్రాత్మకం


వైరారూరల్: స్నానాల లక్ష్మీపురంలో సర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్


సత్తుపల్లి టౌన్: సర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

వైరారూరల్/సత్తుపల్లిటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కులగణనలో భాగంగా చేపట్టిన కుటుంబ నిర్ధారణ సర్వే చారిత్రాత్మకమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి తెలిపారు. శుక్రవారం వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామంలో, సత్తుపల్లి పట్టణంలోని వార్డు నంబర్ 11లోని వెంగళరావునగర్‌లో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను వారు ప్రారంభించి మాట్లాడారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. ఎన్యూమరేటర్లు పకడ్బందీగా సర్వే నిర్వహించాలన్నారు. అంతకు ముందు శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, సర్వే నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాంబాబు, తహసీల్దార్ శ్రీనివాస్, వైరా, సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్లు చింతల వేణు, మందా రవిబాబు, ఎంపీడీఓ సరస్వతి, ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఎన్యూమరేటర్లు నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి భారతి, కౌన్సిలర్లు ఎస్కె నాగుల్‌మీరా, కంటే నాగలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, సుజలరాణి, నర్సింహారావు, కమల్‌పాషా, అరుణ, కరీముల్లా, సిలార్, మల్లూరు దిలీప్, రాము, లక్ష్మయ్య, సునీత, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి

వైరా: సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అన్నారు. వైరాలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. జోనల్ క్రీడలపై పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సమతను అడిగి తెలుసుకున్నారు.

కారేపల్లిలో జోరుగా పత్తి కొనుగోళ్లు


తేమశాతాన్ని పరీక్షిస్తున్న సీసీఐ అధికారులు

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీలక్ష్మిప్రియా కోటెక్స్ జిన్నింగ్ మిల్లులో ఇల్లందు వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రానికి శుక్రవారం అధిక సంఖ్యలో పత్తిలోడ్లతో వాహనాలు వచ్చాయి. కాగా.. 45 వాహనాలు పత్తిలోడ్లతో రాగా, 25 వాహనాలు మాత్రమే పాసింగ్ అయ్యాయని.. ఇల్లందు వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ నరేష్ కుమార్ తెలిపారు. 8శాతం తేమతో 60క్వింటాళ్లు , 10శాతం తేమతో 24క్వింటాళ్లు, 11శాతం తేమతో 60క్వింటాళ్లు, 12శాతం తేమతో 592క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు చేసినట్లు సీసీఐ అధికారులు తెలిపారు. పత్తికొనుగోళ్లను ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది రంజిత్, మున్నీరు, రవి లు పర్యవేక్షించారు.

షరతులు లేకుండా పత్తి కొనుగోలు చేయాలి


మాట్లాడుతున్న కమల్‌రాజ్, పక్కన నాయకులు

మధిర: మధిర వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేసి షరతులు లేకుండా పత్తి కొనుగోలు చేయాలని జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు డిమాండ్ చేశారు. మండలంలోని దెందుకూరు సమీపాన సీసీఐ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు కేజీ పత్తి కొనుగోలు చేయకపోగా తేమ, తదితర కారణాలతో తిప్పి పంపుతున్నారని చెప్పారు. రైతు ప్రభుత్వంగా చెప్పుకుంటున్న పాలకులు ఇకనైనా కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రూ.7,521తో పత్తి కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, నాయకులు బొగ్గుల భాస్కర్‌రెడ్డి, అరిగె శ్రీనివాసరావు, అప్పారావు, బొగ్గుల వీరారెడ్డి, ప్రసాద్, పరిటాల పూర్ణచంద్రరావు, వేమిరెడ్డి చిన్న నాగిరెడ్డి, వంకాయలపాటి నాగేశ్వరరావు, కపిలవాయి జగన్మోహన్‌రావు, దామా శేషగిరిరావు పాల్గొన్నారు.

ఘనంగా శివ పార్వతుల కల్యాణం

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని శ్రీబాలా త్రిపుర సుందరీ సహిత శ్రీచంద్రమౌళేశ్వర స్వామి వార్ల కల్యాణం(శివ పార్వతుల కల్యాణం) గురువారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఆలయ అర్చకులు ఎన్.గోపాలకృష్ణశర్మ శాస్త్రోక్తంగా మేళ తాళాలు, వేదమంత్రోచ్ఛారణల మధ్య కన్నుల పండువగా జరిగింది. గ్రామంలోని భక్తులు శ్రీశివపార్వతుల కల్యాణాన్ని తిలకించి పరవశులయ్యారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

గౌడ వనసమారాధన బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెనుబల్లి: పెనుబల్లి మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే గౌడ వనసమారాధన, సర్దార్ సర్వాయ్ పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ పోస్టర్‌ను ఆ సంఘ నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాగమయి, దయానంద్ పాల్గొని సర్దార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు. అలాగే బైపాస్ రోడ్డు పక్కన గల బొర్రా శ్రీనివాసరావు మామిడి తోటలో నిర్వహించే కార్తీక వన సమారాధనలో గౌడ సంఘాలు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు రమేష్, పెనుబల్లి మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

జలబిందెల ఊరేగింపు

ముదిగొండ: మండలంలోని కట్టకూరులో శ్రీశ్రీ శీతల పరమేశ్వరి, ముత్యాలమ్మ, ప్రతిష్టా శ్రీ అభయాంజనేయస్వామి వారి విగ్రహ ఆవిష్కరణ మహోత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం గ్రామంలో జలబిందెల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. మహిళలు జలబిందెలతో పెద్ద ఎత్తున రేగింపులో పాల్గొన్నారు.

విద్యార్థికి మాజీ ఎమ్మెల్యే సండ్ర సన్మానం

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి గ్రామంలో నిరుపేద విద్యార్థిని ఎంబీబీఎస్ సీటు సాధించింది. గ్రామానికి చెందిన ఎక్కిరాల శ్రీనివాసరావు కుమార్తె కీర్తి మెడిసిన్‌లో సీటు సాధించడంతో ఆమెను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శాలువాతో సత్కరించి అభినందించాడు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు వీరమోహన్‌రెడ్డి, వెంకట్‌లాల్, వెంకటయ్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాతకు సన్మానం

చింతకాని: ఆర్యవైశ్య కార్పొరేషన్ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాతను శుక్రవారం ఆ సంఘం మండల కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం మండల ప్రధాన కార్యదర్శి చల్లా కృష్ణారావు, కోశాధికారి దుర్గాశంకర్, మాజీ మండల అధ్యక్షులు శ్రీనివాసరావు, వీరాంజనేయులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాచుపాము పట్టివేత

మధిర: మధిరలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలో ఒక ఇంటి వద్దకు శుక్రవారం తాచుపాము రావడంతో స్థానికులు ఆందోళన చెందారు. ఈమేరకు స్నేక్ కేచర్ దోర్నాల రామకృష్ణకు సమాచారం ఇవ్వగా ఆయన చేరుకుని పామును బంధించి అటవీ ప్రాంతంలో వదిలేశారు.

'విజయ'లో ఫ్రెషర్స్ డే

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే (ఫ్రెస్కో-24) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్, వైస్ చైర్మన్ విజయలక్ష్మి విద్యార్థులకు కళాశాలకు ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ చిన్నయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆయేషా తరుణమ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ ఫరీద్‌బాబా, వివిధ విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

మైక్రో ఫైనాన్స్ వేధింపులను అరికట్టాలి

తల్లాడ: మైక్రో ఫైనాన్స్ వేధింపులను అరికట్టాలని సీపీఎం తల్లాడ మండల సీనియర్ నాయకుడు శీలం సత్యనారాయణరెడ్డి అన్నారు. ఇటీవల మండలంలోని కేశ్వాపురంలో మైక్రో వేధింపుల తాళలేక ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన బాసాటి సురేష్‌ను పరామర్శించి మాట్లాడారు. ఆస్పత్రి పాలైన సురేష్‌కు రూ.80 వేలు వైద్య ఖర్చులైనా మైక్రో ఫైనాన్స్ తమ వేధింపులను ఆపటం లేదన్నారు. రామారావు, అర్జున్‌రావు, సత్యనారాయణ, సతీష్, శ్రీనివాసరావు, సాకేత్ పాల్గొన్నారు.

అండర్-19 రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులు ఎంపిక


పోటీలకు ఎంపికైన సత్తుపల్లి బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: అండర్-19 రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఖమ్మం స్టేడియంలో సెలక్షన్స్ నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌లో సత్తుపల్లి బాలికల జూనియర్‌కళాశాలకు చెందిన ముగ్గురు ఎంపిక కావడం జరిగింది. బొర్రా కృష్ణవేణి(డిస్కస్‌తో, జవిల్లింగ్ త్రో), సోడే కల్పన(వాకింగ్, జవిల్లింగ్‌త్రో), కొమ్ముగిరి రమ్య(హమర్స్‌తో)లకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ విద్యార్థులను అధ్యాపకులు లలితమ్మ, ప్రమీల, వనజ రాణి, కల్పన, సత్యనారాయణ, కృష్ణవేణి, వెంకటేశ్వరరావు, జాబీనా, సంధ్యరాణి, ప్రియాంకలు అభినందనలు తెలిపారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయండి

కొణిజర్ల: గ్రామస్థాయి నుంచి సీపీఐ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు దొండపాటి రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని తుమ్మలపల్లిలో సీపీఐ 100 సంవత్సరాల వసంతాలను పురస్కరించుకుని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కొణిజర్ల నుంచి తుమ్మలపల్లి మీదుగా దొనబండ వరకు బీటీ రోడ్డు నిర్మించాలన్నారు. పాలక ప్రభుత్వాలు రైతులను విస్మరించాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు సత్యం, సైదులు, కోటేశ్వరరావు, రాజా, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ


డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి

పెనుబల్లి: పెనుబల్లి ప్రభుత్వాస్పత్రిలో చిన్నపిల్లల ప్రత్యేక వైద్య నిపుణుడు బి.వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటిండెంట్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. వైద్యశాలలో చిన్నపిల్లలకు అందించే సేవలను మండల వాసులు వినియోగించుకోవాలన్నారు.

క్రైస్తవులపై దాడులు అరికట్టాలి



మాట్లాడుతున్న డేవిడ్ సుదర్శనం


తల్లాడ: క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని తెలంగాణా క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ ఎం.డేవిడ్ సుదర్శనం అన్నారు. శుక్రవారం తల్లాడలో పాస్టర్ కె.ఇశ్రాయేలు అధ్యక్షతన నిర్వహించిన టీసీసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో క్రైస్తవులందరూ ఐక్యండా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని, క్రైస్తవులకు ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో పాస్టర్లకు, క్రైస్తవులకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఫాస్టర్లు యాకోబు, రాజ్‌కుమార్, యోనా, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

సీఎం రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం పలు మండలాల్లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయల్లో, పంచాయతీల్లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కేక్ కట్ చేసి సీఎంకు శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంచి పెట్టారు. ఆటో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. పలుచోట్ల ఆటో కార్మికులకు నిత్యావసరాలు, ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, పాఠశాలల్లో విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. వక్తలు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం ఆధ్వర్యంలో సంక్షేమ పరిపాలన నడుస్తుందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


కల్లూరురూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి


ఏన్కూరులో..


ఎర్రుపాలెం: కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పొరపాట్లకు తావివ్వొద్దు..

ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం


సత్తుపల్లిటౌన్: మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవిబాబు


బోనకల్: మాట్లాడుతున్న ఎంపీడీఓ రమాదేవి


వైరా: శిక్షణ ఇస్తున్న ఏఎస్ఓ మీరాబీ

వైరా: స్థానిక రైతు వేదికలో శుక్రవారం కులగణన సర్వే నిర్వహించే ఎన్యూమరేటర్లు, సిబ్బందికి శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కేవీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సర్వే చేసే సమయంలో సిబ్బంది ప్రజల నుంచి పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించేలా ఉండాలని, పొరపాట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ చింతల వేణు, ఎంపీడీఓ, సరస్వతి, ఏఎస్ఓ మీరాబీ పాల్గొన్నారు.

- ఏన్కూరు: మండలంలో స్థానిక బాలుర గురుకుల విద్యాలయంలో శుక్రవారం ఎన్యూమరేటర్లకు నిర్వహించిన శిక్షణా క్యాక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ జీవీఎస్ నారాయణలు పాల్గొని మాట్లాడారు.
- కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల రైతు వేదికలో కుల గణన ఎన్యూమరేటర్లకు నిర్వహించిన శిక్షణలో.. తహసీల్దార్ తఫజల్ హుస్సేన్, ఎంపీడీఓ రోజారాణి పాల్గొని మాట్లాడారు.
- సత్తుపల్లిటౌన్: సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణలో తప్పులు దొర్లకుండా అప్రమత్తంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ మందా రవిబాబు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఎన్యూమరేటర్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. కులం పేరు చెప్పటానికి ఇష్టపడని వారికి ఏం కులం కాదు(01 మరియు 999) కోడ్‌ను పెట్టాలని సూచించారు. మొబైల్‌యాప్‌లో సర్వే ఫారంలో కోడ్స్ నింపే విధానాన్ని సులువుగా వివరించారు. ఏమైన సందేహాలు ఉంటే సూపర్‌వైజర్లు, తనకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో మాస్టర్ ట్రైనర్లు పి.లోకేష్, ఎ.జ్యోతి, బి.రామచంద్రు, టీపీఓ రాజు, ఎన్యూమరేటర్లు, రిజర్వ్ సిబ్బంది, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.
- తల్లాడ: తల్లాడ రైతు వేదికలో నిర్వహించిన శిక్షణా సమావేశంలో ఎంపీడీఓ చంద్రమౌళి పాల్గొని మాట్లాడారు. 75 ప్రశ్నలతో కూడిన పత్రాన్ని కుటుంబ సభ్యుల నుంచి సేకరించి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ వనజ, ఎంపీఓ శ్రీదేవి, ఆర్ఐలు భాస్కర్, మొయినుద్దీన్, శిక్షకులు పాల్గొన్నారు.
- కల్లూరురూరల్: మండలంలోని తహసీల్దార్ పులి సాంబశివుడు ఆధ్వర్యంలో ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. అనంతరం సర్వేకు సంబంధించిన సామగ్రిని అందించారు. కల్లూరు మండలంలోని 31 గ్రామ పంచాయతీలలో సర్వే నిర్వహించేందుకుగాను 135 మంది ఎన్యూమరేటర్లను నియమించారు. సర్వేను సమీక్షించేందుకు 15 మంది సూపర్‌వైజర్లను నియమించారు. డివిజన్ వ్యాప్తంగా సర్వేను ఆర్డీఓ రాజేంద్రగౌడ్ పర్యవేక్షించనున్నారు. మండల స్థాయిలో తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఐకేపీ ఏపీఎం వెంకట రామారావు, ఎంపీఓ సురేష్‌బాబు పర్యవేక్షించనున్నారు.
- బోనకల్: బోనకల్ రైతు వేదిక భవనంలో కుటుంబ సర్వే ఫారమ్ నింపడంపై ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీఓ రమాదేవి పాల్గొని మాట్లాడారు. 22 పంచాయతీలలో 16,378 కుటుంబాలను సర్వే చేసేందుకు 106 మంది ఎన్యూమరేటర్లను నియమించినట్లు తెలిపారు. 11 మంది సూపర్‌వైజర్లు పర్యవేక్షించనున్నట్లు తెలిపారు.

నేడు ఎన్యూమరేటర్లకు సమావేశం..

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు గ్రామంలోని రైతు వేదిక కార్యాలయంలో శనివారం కుల గణన సర్వేపై ఎన్యూమరేటర్లకు అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఉషాశారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నిమిత్తం మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 17,519 మంది కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు. మొత్తం 120 వార్డులుగా విభజన చేసి 120 మంది ఎన్యూమరేటర్లను నియామకం చేశామని తెలిపారు.